# ప్రింటింగ్ ప్రెస్ యజమానులు నిబంధనలు పాటించాలి

**కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ బీ గోపి**




మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ బి.గోపి

కలెక్టరేట్, అక్టోబర్ 12 : శాసన సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్ యజమానులు విధిగా ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలని, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ బీ గోపి స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ప్రజాప్రాతినిత్య చట్టం 1951, 127 ఏ సెక్షన్ ప్రకారం ఈసీ మార్గదర్శకాలకు లోబడి పని చేయాలని సూచించారు. గురువారం తన చాంబర్‌లో మాట్లాడారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించి పలు రాజకీయ పార్టీలు, పోటీ చేస్తున్న అభ్యర్థులు, వారి తరపున ఎన్నికలకు సంబంధించి గోడ ప్రతులు, కరపత్రాల ముద్రణలో ప్రచురణకర్త, ప్రింటింగ్ ప్రెస్ పేరు విధిగా నమోదు చేయాలని సూచించారు. వారి పేర్లు లేకుండా కరపత్రాల సంఖ్య తెల్పకుండా ముద్రిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోస్టర్లు, కరపత్రాలు, ఇతర ప్రచార సామగ్రి ముద్రించేందుకు ముందుగా ఇద్దరు వ్యక్తులు తనకు పబ్లిషర్ తెలిసినట్లు ధ్రువీకరిస్తూ, ఇచ్చిన డిక్లరేషన్ కాపీ రెండు పత్రాలను పబ్లిషర్ నుంచి పొందిన తర్వాత మాత్రమే సదరు ప్రింటరు ముద్రణకు చర్యలు చేపట్టాలన్నారు. ముద్రితమైన ప్రచార సామగ్రి ప్రతి వెంట పబ్లిషర్ ఇచ్చిన డిక్లరేషన్ కాపీ జతచేసి జిల్లా ఎన్నికల అధికారికి, రిటర్నింగ్ అధికారులకు సమర్పించాలని ఆదేశించారు. ముద్రించిన ప్రచార సామగ్రిని నిర్ధేశించిన సంఖ్యకు మించి జిరాక్సులు తీయడం వంటి పనులు చేస్తే, ఎన్నికల నియమావళి ఉల్లంఘించినట్లవుతుందన్నారు. అలాంటి వారిని గుర్తించి ఆరు నెలల జైలు శిక్ష, రెండు వేల జరిమానా లేదా రెండు శిక్షలు కూడా అమలు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశామని, వారు ప్రింటింగ్ ప్రెస్ యజమానులకు అవగాహన కల్గించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

కావలెను

jobs Apply Now!

★ రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబి కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో|| + వ|| + జీతం: 15-22 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ఫోన్: 9281452833, 9281452844.

NT-320501-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571
91827 77194

## బతుకమ్మ వేడుకలకు రండి

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఆహ్వానించిన మండలి విప్ కౌశిక్‌రెడ్డి



ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మొక్క అందజేసి బతుకమ్మ వేడుకలకు ఆహ్వానిస్తున్న కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్‌టౌన్, అక్టోబర్ 12: ఈ నెల 14న హుజూరాబాద్ నియోజకవర్గంలో నిర్వహించనున్న బతుకమ్మ వేడుకలకు హాజరుకావాలని బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కోరారు. గురువారం హైదరాబాద్‌లో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి, వేడుకలకు ఆహ్వానించారు. కాగా, వేడుకలకు హాజరయ్యేందుకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అంగీకరించారని మండలి విప్ తెలిపారు. ఈ మేరకు హుజూరాబాద్ నియోజకవర్గంలోని వీణవంక మండల కేంద్రంలో శనివారం ఉదయం 11 గంటలకు జరిగే ప్రజాఆశీర్వాద బహిరంగ సభ, మధ్యాహ్నం 2.30 గంటలకు జమ్మికుంట అంబేద్కర్ కాలనీలో 22వ వార్డు దళితవాడలో బతుకమ్మ అలంకరణ కార్యక్రమంలో ఆమె పాల్గొంటారని వెల్లడించారు. సాయంత్రం ఆరు గంటలకు జమ్మికుంట శివాలయం దగ్గర బతుకమ్మ సంబురాల్లో పాల్గొంటారని కౌశిక్‌రెడ్డి తెలిపారు. బతుకమ్మ వేడుకలకు మహిళలు, మహిళా ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

## కార్యకర్తలకు అండగా ఉంటా

- భవిష్యత్తు బాధ్యత నాదే
- మంత్రి గంగుల కమలాకర్
- బీఆర్‌ఎస్‌లో పలువురు యువకుల చేరిక

కార్పొరేషన్, అక్టోబర్ 12 : బీఆర్‌ఎస్‌లో చేరిన యువతకు పార్టీ అండగా నిలుస్తుందని, వారి భవిష్యత్తు బాధ్యత తనదేనని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ హామీ ఇచ్చారు. నగరంలోని పలువురు యువకులు స్థానిక మంత్రి మీ సేవా కార్యాలయంలో మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరగా, వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో పెద్ద ఎత్తున గులాబీ గూటికి చేరిన యువత భవిష్యత్తు బాధ్యత తనదేనని అభయం ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రం రాకముందు కరీంనగర్ అన్ని రంగాల్లో వెనుకబడి ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ సహకారంతో నగరాభివృద్ధికి రూ.వందల కోట్ల నిధులు తీసుకొని వచ్చినట్టు వెల్లడించారు. నగరంలో ఎక్కడ చూసినా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, హైదరాబాద్ తర్వాత కరీంనగర్‌ను రెండో నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. నగరం రాత్రిపూట జిగేల్‌మంటున్నదని, కరీంనగర్‌ను పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే కేబుల్ బ్రిడ్జ్ అందుబాటులోకి తెచ్చామని, మానేర్ రివర్ ఫ్రంట్ పనులు 25 శాతం పూర్తి చేశామన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లు ఢిల్లీ పార్టీలు అని, బీఆర్‌ఎస్ ఒక్కటే మన ఇంటి పార్టీ అని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ ఆలోచన అంతా తెలంగాణ అభివృద్ధి అని, దేశానికి అన్నం పెట్టే స్థాయిలో తెలంగాణ అభివృద్ధి చెందిందన్నారు. రానున్న ఎన్నికల్లో కేసీఆర్ చేతులు బలోపేతం చేయాలని యువతకు పిలుపునిచ్చారు. యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని, మంత్రి కేటీఆర్ సహకారంతో హైదరాబాద్‌కు పెద్ద ఎత్తున విదేశీ కంపెనీలు తరలి వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ సునీల్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు పాల్గొన్నారు.

## కొప్పుల గెలువాలని పెద్దయ్య దేవుడికి మొక్కులు

ధర్మారం,అక్టోబర్ 12: రాష్ట్ర మంత్రి, ధర్మపురి ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఘన విజయం సాధించాలని కొత్తూరు గ్రామానికి చెందిన ట్రాక్టర్ యూనియన్ సభ్యులు పెద్దయ్య దేవుడికి మొక్కుకున్నారు. గ్రామానికి చెందిన 40 మంది యూనియన్ మెంబర్లు గురువారం మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని పెద్దయ్య దేవుడిని దర్శించారు. ఆలయంలో పూజలు చేశారు. కొప్పుల ఈశ్వర్ మళ్లీ గెలవాలని మొక్కుకున్నామని చెప్పారు. ఇక్కడ సర్పంచ్ తాళ్ల మల్లేశం గౌడ్,ట్రాక్టర్ యూనియన్ చైర్మన్ బానోతు రాజేశ్ నాయక్, ఉపాధ్యక్షుడు సామల రాజయ్య ఉన్నారు.

# ₹6.50 లక్షలు సీజ్

సుల్తానాబాద్‌రూరల్/ రామగిరి/ గంభీరావుపేట, అక్టోబర్12: ఉమ్మడి జిల్లాలో అక్రమంగా తరలిస్తున్న నగదును పట్టుకుంటున్నారు. బుధవారం కథలాపూర్ మండలం కలికోట శివారులో ₹6.60లక్షలు పట్టుకోగా, గురువారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ₹6.50 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. సంగారెడ్డికి చెందిన ఉదయ్‌కిరణ్ కారులో రూ. లక్ష నగదుతో పెద్దపల్లికి వస్తుండగా, దుబ్బపల్లి చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు తనిఖీ చేశారు. ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో ఆ డబ్బును జప్తు చేసినట్లు ఎస్‌ఐ విజేందర్ తెలిపారు. రామగిరి పోలీస్‌స్టేషన్ పరిధి పన్నూరు ఎక్స్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా నాగెపల్లికి చెందిన ఒక వ్యక్తి రూ.లక్ష నగదు స్వాధీనం చేసుకున్నట్టు రామగిరి ఎస్‌ఐ రవి ప్రసాద్ తెలిపారు. అలాగే సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల పరిధిలో పెద్దమ్మ చెక్‌పోస్ట్ వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు చేశారు. కామారెడ్డి నుంచి కరీంనగర్‌కు వెళ్తున్న కారును (కేఏ27ఎం9264) ఆపి తనిఖీ చేశారు. కారులో ఉన్న సయ్యద్ ఖలీమొద్దీన్ వద్ద లక్ష రూపాయల నగదు ఉండడంతో స్వాధీనం చేసుకున్నారు. సదరు నగదును జిల్లా ట్రెజరీకి అప్పగించినట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తెలిపారు.

### కరీంనగర్‌లో ₹2లక్షలు

రాంనగర్, అక్టోబర్ 12: కరీంనగర్‌లోని రాజీవ్‌చౌక్ వద్ద గురువారం పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో ఎలాంటి ఆధారాలు లేని ₹2 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ పోలీసులు తనిఖీలు చేస్తుండగా, మారుతీనగర్‌కు చెందిన ఎరుకల వీరేశం నగదుతో వెళ్తుండగా తనిఖీ చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ₹2 లక్షలు ఉండడంతో స్వాధీనం చేసుకొని రెవెన్యూ అధికారులకు అప్పగించారు.

### మల్యాల మండలంలో ₹1.50లక్షలు

మల్యాల, అక్టోబర్ 12: జగిత్యాల -కరీంనగర్ ప్రధాన రహదారిపై మల్యాల మండలం రాజారాం శివారులో పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు చేస్తున్నారు. రాజస్థాన్‌కు చెందిన సయ్యద్ ముస్తాక్, మలావత్ సునీల్ కారులో ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం వెళ్తుండగా, రాజారాంలో చెక్‌పోస్టు వద్ద ఆపి తనిఖీ చేశారు. వారివద్ద ₹1.50 లక్షలు ఉన్నట్లు గుర్తించామని, అయితే వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు మల్యాల ఎస్‌ఐలు కందుకూరి కుమారస్వామి, తీగల అశోక్ తెలిపారు. తనిఖీల్లో ప్రత్యేక బృంద సభ్యులు కనకయ్య, మోహన్, రాజయ్య, చాంద్‌పాషా ఉన్నారు.

### చీరెల స్వాధీనం



చీరెలను స్వాదీనం చేసుకున్న ఎస్‌ఐ శ్వేత

వెల్గటూర్, అక్టోబర్12: ఎన్నికల్లో పంచేందుకు నిల్వ ఉంచిన చీరెలను వెల్గటూర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ శ్వేత వివరాల ప్రకారం.. చెగ్యాం గ్రామానికి చెందిన పాత సూర్యనారాయణ అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా చీరెలు నిల్వ ఉంచారని సమాచారం మేరకు దాడులు చేశాం. అయితే ఎలాంటి ఆధారాలు లేకుండా ₹80,550 విలువైన 179 చీరెలను నిల్వ ఉంచడంతో స్వాధీనం చేసుకున్నామని, ఎన్నికల్లో ప్రజలకు పంచేందుకు నిల్వ ఉంచినట్లు విచారణలో వెల్లడైనట్లు వివరించారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

## బీఆర్‌ఎస్ అంటే కాళేశ్వరం.. కాంగ్రెస్ అంటే శనేశ్వరం

- గ్యారెంటీ ఉన్న గులాబీ పార్టీని గెలిపించండి
- పెద్దపల్లి ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లి/ఎలిగేడు అక్టోబర్12: 'బీఆర్‌ఎస్ అంటే కాళేశ్వరం..కాంగ్రెస్ అంటే శనేశ్వరం' అని పెద్దపల్లి ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. వారంటీ లేని హస్తం పార్టీని నమ్మొద్దని, గ్యారెంటీ ఉన్న గులాబీ పార్టీని ఆదరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన ఎలిగేడు మండలం లాలాపల్లి, బురహన్‌మియాపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. లాలపల్లి, ర్యాకల్‌దేవ్‌పల్లి గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి పెద్దపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆయాచోట్ల మాట్లాడారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్నిరంగాల్లో ముందుంటూ దేశానికే దిక్సూచిగా నిలిచిందని చెప్పారు. కాంగ్రెస్ మాయమాటలు నమ్మి ఓటేస్తే కన్నీళ్లు మిగలడం ఖాయమని పేర్కొన్నారు. 24 గంటల ఫ్రీ కరెంట్, రైతుబంధు, రైతుబీమా పథకాలను అమలు చేస్తున్న గులాబీ పార్టీని ఆదరించాలని కోరారు. పని చేసే కార్యకర్తలను కడుపులో పెట్టి కాపాడుకుంటామని పేర్కొన్నారు. చేరినవారిలోల మల్లికార్జున స్వామి ఆలయ చైర్మన్ గుర్రం మల్లారెడ్డి, రెడ్డి సంఘం బోర్డు మెంబర్ కోమటిరెడ్డి కిషన్ రెడ్డి, ర్యాకల దేవ్‌పల్లికి చెందిన గోపు రవీందర్ రెడ్డి, కల్వల సంజీవరెడ్డి, మల్లేశ్ అజయ్ రెడ్డి, లచ్చయ్య, కాసర్ల సాగర్ రెడ్డి, గోపు జితేందర్‌రెడ్డి ఉన్నారు. కార్యక్రమంలో ఎలిగేడు ఎంపీపీ తానిపర్తి స్రవంతి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, సర్పంచ్ రాచర్ల కొండయ్య రాజ, సర్పంచులు, తానిపర్తి మోహన్‌రావు, మండిగ రాజనర్సయ్య పాల్గొన్నారు.



ఎలిగేడు మండలం లాలాపల్లిలో వృద్ధుడిని ఓటు అభ్యర్థిస్తున్న పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి